# రాతి బొమ్మలో అమ్మ

మధ్యాహ్నం 12 గంటలయింది. ఎండ మిటు మిటలాడుతోంది. ఊరి చివర పూరిగుడిసెల దగ్గరున్న పిల్లలు వెన్నెట్లో ఆడుకుంటున్నట్లుగా మండుటెండలో ఆడుకుంటున్నారు ఒకరికీ సరిగా వంటిమీద బట్టల్లేవు. వాందరు నీటి గుంటల్లో మురికిస్నానాలు చేస్తున్నారు. వారితో పాటు పందులు కూడా అక్కడే దొర్లుతున్నాయి. కుక్కలు వారి వెంటేతిరుగుతున్నాయి. కోళ్ళు ఆహారం వెతుకుతూ తిరుగుతున్నాయి. వాటి వెంటే పిల్లలు తిరుగుతున్నాయి.

ఎదురుగా పూరిపాక పంచలో కూర్చున్నముసలమ్మ ఆదృశ్యాన్ని చూస్తుంటే. ఆనందంగా మరో పక్క ఆశ్చర్యంగా కూడా ఉంది.

"ఇక్కడి వాళ్ళకి ఎండావానా కూడా తెలీదనుకుంటాను." అనుకుంటూనే ముసలమ్మ పక్కనే ఉన్న పాత గుడ్డలు మడతలెట్టుకోడం మొదలు పెట్టింది.

"ఇదిగో ముసలమ్మా! నువ్వుకూడా కాయితం పెట్టాలా?"

"కాయితం పెట్టడందేనికి?" మడతపెడుతున్న పాత చీరలు పక్కకు పెట్టి అడిగింది.

"కాయితం సంగతి మొన్ననే సెప్పాగదా! ఇల్లులేనోరికి యిల్లతవాలు ఇత్తారట."

"ఈ వేళో రేపోపోయెదానికి నాకెందుకు ఇల్లతలాలు" ముసలమ్మ కళ్ళలో నీళ్ళు నిండాయి. పేరంటానికి కనబడకుండా తల దించుకుంది.

"ఏందో ముసలమా! నీదంతా మరీ యిడ్డూరం. ఈయేలే సత్తావో రేపే సత్తావో యెవరు సెప్పగలరు? నువ్వు మంచమెక్కితే ఇంత గంజి కాసి పోసెదెవరు? పైసా చేతిలో లేని దానివి? కాస్త ముందు ఎనక సూసుకో!"

"నాకెవరు యిత్తారుట? అయినా నలుగురితో పాటు నారాయణ! అలాగె కానీ! అయినా నన్నడిగేదేమిటి? మీకు తోచినట్టు చెయ్యండి!"

"ఇంక మాటాడబోక! లేనోళ్ళకే యిల్లతలాలు. కాయితం రాయిత్తాను. కాదనబోక!"

"ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది. సరేకానీ!" ఆమాట వినగానె పేరంటాలక్కడనుంచి కదిలింది.

ఏనాటి బంధమోయిది? అసలు వాళ్ళు దూరమయ్యారు. దూరస్తులు దగ్గరయ్యారు?" వెడుతున్న పేరంటాల్ని చూసి నిట్టూర్పు విడిచింది ముసలమ్మ.

కాలచక్రం సుఖదుఃఖాలను తోసుకుంటుముందుకు కదులుతోంది. ముసలమ్మ మనస్సు సుఖదుఃఖాలను మోసుకుంటు వెనక్కు కదిలింది.

హనుమాయమ్మ భర్త సాంబశివం బట్టల వ్యాపారం చేస్తూండే వాడు. పొగలల్లా దుకాణంలో కూర్చున్నా దుకాణం ముయ్యగానె యిల్లు చేరేవాడు. వచ్చిన ఆదాయంలో మూరెడు పూలమాలకొన్ని, మిఠాయి

కొమ్ముల పొట్లం కొని భార్య చేతిలో పెట్టేవాడు. భర్త కౌగిలిలో మురిసి పోయేది ఆయిల్లాలు. ఆమె కూడా కందిపొడి, అప్పడాలు, వడియాలు మొదలైనవి యింట్లోనె చేసి అమ్మేది. ఆ డబ్బుదాచి పొదుపుగా సంసారం చేసేది. సాంబశివం ఒక ఎకరం భూమి, ఒక చిన్న యిల్లు సంపాదించాడు. వారికి లేకలేక రాజా, సుందరి పుట్టారు. రాజా చాలా చురుకైనవాడు. అతన్ని పెద్ద చదువు చదివించాలని ఆ దంపతుల ఆశయం. సుందరి పేరుకు తగిన పిల్ల. ముద్దుగా మాట్లాడుతూ తల్లి వెనకే తిరిగేది. పది వసంతాలు గడవకముందే సుందరి హఠాత్తుగా జబ్బు చేసి కనపడనిచోటుకు వెళ్ళిపోయింది.

కడుపుశోకం భరించలేక ఆ దంపతులు మంచంపట్టారు. రోజులు గడిచిపోతున్నాయి కాని సాంబశివం ఆరోగ్యం కుదుటపడలేదు. వ్యాపారం కూడా బాగా దెబ్బతింది. దుకాణం అమ్మేసి అప్పు తీర్చవలసి వచ్చింది. ఆ బెంగతో అతని ఆరోగ్యం మరింత చెడింది. వైద్యం చేయించడానికి ఆమె దగ్గర పైసా లేకపోయింది. ఎకరం భూమి మీద అప్పుచేసి అతనికి వైద్యం చేయించడం మొదలు పెట్టింది ఆ ఇల్లాలు.

"హనుమా? నేనెలాగు బతుకుతానన్న ఆశలేదు. ఎన్ని కష్టాలు వచ్చినా రాజీ చదువు ఆపకు. వాడు పెద్ద చదువు చదివి మంచి ఉద్యోగం చెయ్యాలి. వాడిని చదివించు హనుమా?" ఆమె రెండు చేతులు పట్టుకుని ఆమె వడిలో తలవాల్చాడు. అతని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

హనుమాయమ్మ దుఃఖానికి అంతులేదు. ఆమెకు భర్తలేని భవిష్యత్తు అంధకారంలా కనబడింది. ఆ అంధకారంలో చిరుమేరుపులా కొడుకు రాజా కనపడ్డాడు. దుఃఖాన్ని కడుపులోనె దాచుకుని కొడుకును పెంచడం మొదలుపెట్టింది. ఎకరం భూమి అమ్మేసి అప్పులు తీర్చి

మిగిలిన డబ్బు పోస్టాఫీసులో పెట్టింది.

రోజులు గడిచిపోతున్నాయి. రాజా పదవతరగతి పాసయ్యాడు. మొదటి తరగతి వచ్చింది. ఆ వూళ్ళో యింక చదువులేదు. పట్నం పంపించి చదివించే శక్తి హనుమాయమ్మకులేదు. మంచి మార్కులతో పాసయిన కొడుకును చదువుమానిపించి అతని భవిష్యత్తు నాశనం చెయ్యాలనీలేదు. పోస్టాఫీలో వేసిన డబ్బు ఖర్చు అవుతూనే వుంది. ఆ డబ్బు అయిపోతే ఎన్ని యిబ్బందులు పడాలో ఆమెకు బాగా తెలుసు, అందుకే మరింత భయపడుతోంది.

"హనుమాయమ్మా! ఇంకేం చదివిస్తావు? పద్దులురాయడం నేర్చుకున్నాడుగా! ఆతండ్రి వ్యాపారం చేయించు. చదువు సంగతి మర్చిపొమ్మను" దగ్గర బంధువులు కొందరు సలహాయిచ్చారు.

ఆమాటలు హనుమాయమ్మ గుండెల్లో శూలాల్లాదిగాయి. కారే కన్నీళ్ళు తుడుచుకుంది కాని వారికి సమాధానం చెప్పలేదు. చెప్పినా ప్రయోజనం లేదని ఆమెకు తెలుసు.

"మనకు డబ్బులేదుట కదమ్మా! అందరూ నన్ను బట్టలు అమ్ముకోమంటున్నారు పోనీ ఆపని చేస్తానమ్మా!" రాజా తల్లిని కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు. డబ్బులేదని కాదు. వారు అవమానించారని తలచిన ఆ పసి హృదయం గాయపడింది!

"వాళ్ళ మాటలు పట్టించుకోకు బాబూ! నువ్వు బాగా చదువుకోవాలి. డబ్బు నేనిస్తాగా!" కొడుకును దగ్గరకు తీసుకుని ఓదార్చింది. ఆతల్లి ఒడిలోని మమకారంలో రాజా సర్వంమరిచిపోయాడు. రాజా ముఖం పున్నమి చంద్రునిలా వెలిగింది. ఆ వెలుగే ఆతల్లి కళ్ళల్లో అనురాగ దీపం.

పోస్టాఫీసులో ఉన్న డబ్బు పూర్తిగా తీసుకుని కొడుకును పట్నె

పంపి ఇంటర్‌లో చేర్పించింది. తాను ఆ పల్లెలో ఆ యింట్లోనె ఉంది. తను యిది వరకు చేసుకునే అప్పడాలు, కందిపొడి, ఒడియాలుచేసి తిరిగి అమ్మడం ప్రారంభించింది. ఎక్కువ యిబ్బందులు లేకుండానే రాజా ఇంటర్ పరీక్షలు పూర్తి చేసుకుని వచ్చాడు.

ఆ చదువువల్ల ప్రయోజనంలేదు. ఉద్యోగం దొరకాలంటెకనీసం బి. ఎ పాసవ్వాలి అంత పల్లెటూరైన కాస్తలోకజ్ఞానం హనుమాయమ్మకుంది. కొడుకును బి.ఎ చదివించాలి. చేతిలో పైసాలేదు. తిరిగి డబ్బు సమస్య ఎదురయింది.

"ఇంకా ఆకొంప కనబడుతోందిగా! అదీ తగులబడి పోతేగాని ఆ తల్లీకొడుకుల మిడిసిపాటు తగ్గదు. దున్నపోతు మీద వర్షం పడితే ఎంతో ఆవిడగారికి సలహాయిచ్చినా అంతే! అదీ చూద్దాం! బంధువులు హనుమాయమ్మ ప్రయత్నానికి రంకెలు వేసారు. హనుమాయమ్మకు ఆ మాటలు పడ్డం అలావాటైపోయింది. ఈసారి ఇల్లు తాకట్టుపెట్టి డబ్బు పట్టుకొచ్చింది. ఇంటర్ పాసైనకొడుకును బి.ఎలో చేర్పించింది.

తాను కూడా పట్నం వెళ్ళి కొడుక్కు వండి పెట్టాలని వుంది. ఇంటి అద్దెకు, తిండి ఖర్చులకు చాల అవుతుంది. పైగా పల్లెలో యింటికి పైసా అద్దిరాదు. హనుమాయమ్మ భయపడి ఆ ప్రయత్నం విరమించుకుంది. కొడుకు చదువుకు వెళ్ళగానే హనుమాయమ్మ తన పనిలో నిమగ్నమయింది. ఒక్క నిముషం కూడా వ్యర్థ కాలక్షేపం లేదు. మరిన్ని అప్పడాలు, కందిపొడితో పాటు రకరకాల పొడులు, రక రకాల వడియాలు తయారుచేస్తోంది. అవి అమ్మడమే వయసు మీద పడుతున్న ఆ యిల్లాకి కష్టమైపోయింది. వంటరి ఆడది. సహాయం చేసేవారులేరు. వంకలు పెట్టేవారు ఆ పల్లెలో ఎంతో మంది ఉన్నారు.

బి. ఎ. రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని వచ్చాడు రాజా.

ఇంట్లో తల్లిని చూసి కంగారుపడ్డాడు. తల్లి పది సం॥ పెద్దదానిలా కనబడుతోంది. పైగా తలంతా నెరిసిపోయింది. దవడలు ఎండి ముందరి పళ్ళు పైకి వచ్చాయి. శరీరం చిక్కి ముడతలు పడింది.

''అమ్మా! నేనేదైన ఉద్యోగం వెతుక్కుంటానమ్మా! నా కోసం నువ్వేం కష్టం చెయ్యొద్దమ్మా! నామాట వినమ్మా!" తల్లి ఒడిలో తల పెట్టుకుని రాజా వెక్కి వెక్కి యేడ్చాడు.

హనుమాయమ్మ హృదయం అన్ని విషయాలలో నవనీతమే, కాని కొడుకు చదువు విషయంలో మాత్రం కఠినమైపోయింది.

"రాజాను చదివించాలి. రాజా పెద్ద ఉద్యోగం చెయ్యాలి" మరణ సమయంలో భర్త అన్న మాటలు ఆమె చెవుల్లో గింగురు మంటున్నాయి అందుకే తినడానికి తిండి లేకపోయినా కొడుకును చదివించడానికే నిశ్చయించుకుంది. ఈసారి యిల్లు అమ్మకానికి పెట్టింది.

అమ్మో! అమ్మో! ఇదేం విడ్డూరం. ఉన్న నీడ కూడా అమ్ము కుని చెట్లకింద బతుకుతుందా! వీధిని పడి ముష్టి ఎత్తు కోవలసివస్తుంది. ఆడపెత్తనం బోడిపెత్తనమన్నారు ఇదే" ఈ విధంగా బంధువులు ఆడి పోసారు. హనుమాయమ్మ నోరు మెదపలేదు. కొడుకు ఉద్యోగం చేస్తా నని చదువు మానేస్తానని మొత్తుకున్నా వినలేదు. యూనివర్సిటీలో ఎమ్. ఎలో చేర్పించింది.

పనికి వచ్చే సామానులు అమ్మేసి వీధి చివరనున్న పూరి పాకలోకి మారింది. అప్పడాలు అవిచేసి అమ్మే ఓపిక లేదు. ఒక షావు కారింట్లో వంటకు కుదిరింది.

కొడుకు దగ్గర నుంచి ఉత్తరం వచ్చిన రోజున ఆమె సంతోషా నికి అంతులేదు ఎవరో ఒక పెద్ద వ్యాపారస్తుడు తన ఫీజులు కడతాడని డబ్బు పంపవద్దని తమ కష్టాలు గట్టెక్కాయని రాసాడు. తన అదృ

ష్టానికి, కొడుకు అదృష్టానికి మురిసిపోయింది ఆతల్లి. పరీక్షలు బాగా రాసిన రాజా రెక్కలు కట్టుకువాలాడు. పూరిపాకలో అస్థిపంజరంలా ఉన్న తల్లిని చూసి వెక్కి వెక్కి యేడ్చాడు.

"అమ్మా! ఆ వ్యాపారస్తుడే నాకు ఉద్యోగం ఇస్తానన్నాడమ్మా! నేను వెంటనే వెళ్ళి ఉద్యోగంలో చేరాలమ్మా! నిన్ను చూసి పోదామని వచ్చాను. ఇల్లు చూసుకుని తీసుకు వెడతానమ్మా!" తనయుని కంఠంలో ఏదో ఆత్మీయత, ఆతల్లి హృదయంలో ఏదో తీయని మెరుపు. ఇద్దరి కళ్ళలో ఆనందాశ్రువులు. ఒకరికి తెలియకుండా మరొకరు కళ్ళొత్తుకున్నారు.

కొడుక్కిష్టమని మినప సున్ని చేసియిచ్చింది. అప్పడాలు వడియాలు ఊరగాయాలు సద్దియిచ్చింది. ఇల్లు అమ్మిన డబ్బుకూడా అయిపోయిందని రాజాతో చెప్పలేకపోయింది. కొత్త ఉద్యోగం తలచుకుంటూ కలలుకంటున్న రాజా కూడా ఆ సంగతి అడగలేదు. త్వరలోనే వచ్చి తీసుకు వెడతానమ్మా!'' రాజా తిరుగు ప్రయాణమై వెళ్ళిపోయాడు.

హనుమాయమ్మ నీరసంగా చింకినులక మంచం మీద వాలిపోయింది.

రోజులు గడుస్తున్నాయి. రాజా దగ్గర నుంచి యిల్లు చూసానని కాని, తల్లిని రమ్మని కాని ఉత్తరంలేదు. ప్రతినెల డబ్బు పంపిస్తున్నాడు. హనుమాయమ్మ ఆ డబ్బు ఖర్చుపెట్టకుండా దాచుకుంటోంది. ఒప్పుకున్న వారింట్లో వంటచేసి తన పొట్ట పోసుకుంటోంది.

ఒకరోజు హఠాత్తుగా రాజా దగ్గరనుంచి ఉత్తరంతో పాటు పెళ్ళి శుభలేఖ కూడా వచ్చింది. ముందు ఆ శుభలేఖ ఎవరిదో అనుకుంది. పరిశీలిస్తే రాజా పెళ్ళి శుభలేఖ. వివాహానికి తల్లికి ఆహ్వానమేలేదు. పెళ్ళి

అయి తరువాత కోడలితో ఆ వూరు వస్తానని రాసాడు.

ఆవుత్తరంచదివిన హనుమాయమ్మకుకొడుకు మారిపోతున్నాడేమే నన్న అనుమానం వచ్చింది. కాని అతన్ని పెద్ద ఉద్యోగస్తుని చేయడం తన ధర్మం. అతను తల్లిని ఇంతకంటె ఉద్ధరిస్తాడనుకోడం తల్లి పట్ల దురాశె అవుతుందేమో? హనుమాయమ్మ ఆలోచన నుండి తేరుకుంది.

తర్వాత పోస్టులో పెళ్ళి ఫోటోలు పంపించాడు. చూపు తగ్గిపోయిన హనుమాయమ్మకు ఆ ఫోటోలు మసక మసకగా కనిపించాయి. అప్పుడప్పుడు తడిమి చూసుకోవచ్చని తలకిందే పెట్టుకుంది.

"మీ అబ్బాయి కోడలు కనపడ్డారు. మీ మనవడు బాగున్నాడు! అంటు ఊళ్ళో వాళ్ళు అప్పుడప్పుడు చెబుతుంటె హనుమాయమ్మ గుండె కలుక్కుమనేది. అయినా ఆ బాధని ఆ తల్లి మూగమనసులోనె దాచుకునేది.

క్రమంగా ఉత్తరాలు రావడం ఆగిపోయాయి. డబ్బు అందడం లేదు. చేతిలో నయాపైస లేదు. శరీరంలో పీసమెత్తు సత్తువలేదు. మూగబోయిన గుండెకు ఆలోచించే శక్తిలేదు. ఆ వూళ్ళో ఉండలేకపోయింది.

కింద, మీదు చూడకుండా పిల్లలమీద డబ్బు ఖర్చు పెడితే ఇదిగో ఈ హనుమాయమ్మలాగె ముష్టెత్తుకోవాలి" హనుమాయమ్మకు ఆ వూళ్ళొ తరుచు వినబడే మాటలు. తన మూలంగా ఆ వూళ్ళొ వాళ్ళు జాగ్రత్త నేర్చుకుని బాగుపడితే తనకు అంతకంటె యేం కావాలి."?

ఒకనాటి తెల్లవారు ఝామున హనుమాయమ్మ ఆ వూరు వదిలింది. ఉన్న నాలుగు చింకి చీరలు, మాసిన పక్కబట్టలు, చిల్లులుపడ్డ గిన్నెలు మూటకట్టి నెత్తిన పెట్టుకుంది.

ఆలా నడుస్తూనెఉంది. ఆయాసమన్న చోట చతికిలబడుతోంది. వస్తిదో రెండెడ్ల బండి ఆటు పోతోంది. హనుమాయమ్మను చూసి జాలి

పడిన అతను బండి ఆపాడు హనుమాయమ్మను బలవంతంగా బండి ఎక్కించాడు.

"ఎక్కడికెళ్లాలి ముసలవ్వా!" హనుమాయమ్మ సమాధానం చెప్పలేదు.

"నీకెవరులేరా?"

"లేరు బాబూ"

"అయితే ఓ పని సెయ్యి. మావూరులో దింపెత్తాను. మరెక్కడుంటావు? ఎలా బతుకుతావు?"

ఎలాగో అలాగ బతుకుతాను. అదిగో ఆ గుడిసెల దగ్గర దింపేసెయ్యి."

బండి ఆగింది. "ఇదిగో ముసలమ్మా! కొత్తూరు జాగ్రత్త" హనుమాయమ్మను చెయ్యి పట్టుకుని కిందికి దింపాడు. మూట ఆమె చేతికి అందించాడు. హనుమాయమ్మ అతి నీరసంగా ముందుకు అడుగు వేసింది.

బండిలో గడ్డిమాటున దాచిన కర్రతీసి "ఇదిగో ముసలమ్మా! ఇది పట్టుకునడు. అనట్టు ఇదిగో ఇది నీ దగ్గరుంచుకో" మొలలోంచి తీసి పది రూపాయల చిల్లర ఆమె చేతిలో పెట్టాడు.

హనుమాయమ్మ అతనివైపు జాలిగా చూసింది. పొంగివచ్చే దు ఖాని బలవంతంగా ఆపుకుంది. తన గుండెకు ఆరని గాయమయింది ఏ జాలి చూపు తగిలినా ఏ చల్లనిమాట తగిలినా ఆదిరేగి సలుపుతూనె వుంటుంది.

బండిని తోలుకుంటు అతను ముందుకు వెళ్ళిపోయాడు. ఆ ముసలమ్మ ముందుకు అడుగువేసింది. ఆమెను గుర్తుపట్టి పలకరించే వారులేరు. గుప్పెడన్నం పెట్టేవారులేరు. ఊరి చివర మురికివాడలో

అడుగు పెట్టింది ముసలమ్మ. ఎదురుగా పంచలో కూర్చుని పేలు కుక్కుం చుకుంటున్న పేరంటులు ముసలమ్మను చూసింది.

"ఎవరాల్లు" ముసలమ్మ సమాధానమీయలేదు మరి కాస్త ముందుకు వెళ్ళి ఆమెకు ఎదురుగా నిలబడింది. కర్రతో నడవడం ఆమెకు తేలిగ్గా అనిపించింది.

"ఏరు కావాలి? పోని ఏడనుంచి వత్తున్నావు?" ముసలమ్మ సమాధానం చెప్పలేదు. దీనంగా పేరంటాలు వైపు చూసింది.

"దిక్కులేని దాని వా? మాకు సాయం నువ్వొకత్తివి. ఇదిగో పంచలో పడుండు".

ఆ ముసలమ్మ ఆ పంచలో మూలగా తన మూట పెట్టుకుంది". ఉండడానికి యింత పంచ దొరికింది. అంతకంటే తనకేం కావాలి!" ముసలమ్మ మనసు కాస్త కుదుటపడింది.

"ఇదిగో ముసలమ్మా! నీ దగ్గర కాస్త డబ్బుందా ?"

ముసలమ్మ "ఉన్నదని" తలూపింది.

"సరేలే ఉంటే దాచుకో! ఇదిగో ఈ పూటకి నూకలు కాసికాస్త గంజిపోత్తాలె. రేపటి సంది సూద్దాం" పేరంటాలు సత్తు చెంబుతో మంచి నీళ్ళు పట్టుకొచ్చి ముసలమ్మకిచ్చింది. ముసలమ్మ గట గట నీళ్ళు తాగి గట్టిగా ఊపిరి పీల్చుకుంది.

సాయంకాలమైనదేమో చల్లని గాలి వీస్తోంది. దుర్గంధం గుపుమంటోంది. దోమలు గుయ్యిమంటున్నాయి. పిల్లలు, అల్లరిచేస్తున్నారు. కుక్కలు, మేకలు అరుస్తున్నాయి. అయినా ఆ ముసలమ్మ పంచలో నడుంవాల్చింది. ఆ చింకి మూట తలకిందకు లాక్కుంది. అరసెకనులో నిద్రలోకి జారిపోయింది.

ఉలిక్కిపడిన ఆ ముసలమ్మ గతంలో నుంచి వర్తమానంలోకి

వచ్చింది. గతం తలచుకుని ఏడ్వలేదు. వర్తమానం తలచుకుని బాధ పడలేదు. బాధపడే ఓపిక లేదు. అయినా రాజా కళ్ళ ముందు మెదిలాడు.

తన రాజా ఎలా వున్నాడో? తండ్రి కోరిక నెరవేర్చి పెద్ద ఉద్యోగమే చేస్తుండాలి. కాటికి కాళ్ళు చాచుకుని వున్న తన కోసం ఆ కొడుకు భవిష్యతు చెడిపోకూడదు. తనను చూడకపోయినా వాడు పిల్లా పాపలతో సుఖంగా వుండాలి. తల్లి తప్పుమరెవ్వరూ అలాకోరుకోరు ఆమె చెడినా ఆమె మాతృ హృదయం అలాగే ఉంది. ఆమె మనసు కాస్త కుదుటపడింది.

"ఇదిగో ముసలమ్మా! లేవాలి కలట్టరుగారు వచ్చేత్తున్నారు. లైను పెరిగి పోతోంది. ఆడ మందిని పెట్టివచ్చా!" పేరంటాలు పెనిమిటి తొందర చేస్తూనే కదిలాడు. అతని వెనక పేరంటాలు ముసలమ్మతో బయలుదేరింది.

ఎండ మండి పోతోంది. కాళ్ళు కాలి పోతున్నాయి. నోరెండి పోతోంది. ముసలమ్మ ఆయాసపడుతోంది. నడవలేక వెనుకబడుతోంది పేరంటాలు మధ్య మధ్యలో ఆగుతోంది, తొందర చేస్తోంది. చివరకు లైను చేరుకున్నారు. ఇంకా కలక్టరుగారు రాలేదు. దారి వెనక లైను పెరుగు తూనే ఉంది.

పేరంటాలు పెనిమిటి వచ్చి రాయించిన కాగితం ముసలమ్మ చేతిలో పెట్టాడు. "ఇదిగో ముసలమ్మా! గట్టిగా పట్టుకో" మరోసారి చెప్పాడు పేరంటాలు పెనిమిటి.

ఆ ఎండవేడిలో ముసలమ్మ నిలబడలేకపోతోంది. అయినా బల వంతంగా నిలబడింది. నోరెండిపోతోంది. పేరంటాలు పక్కనే ఉన్న కుండలో నీళ్ళు సత్తుగ్లాసుతో అందించింది. ఆ చల్లని నీళ్ళు నోట్లో

పడగానె ప్రాణంలేచి వచ్చింది ముసలమ్మకు. గ్లాసులో అడుగున పు రి నెడు నీళ్ళు మిగుల్చుకుని మొహంమీద చల్లుకుంది. అలసట కాస్త తగ్గినట్లయింది.

"కలట్టరుగారు వత్తున్నారు! వత్తున్నారు" కేకలు వినబడ్డాయి. ఏదో కలకలం — ఏదో సంచలనం. జనం ఒకరి నొకరుతోసుకుంటు ముందుకు నడిచారు. ముసలమ్మ ఆ తోపుడికి పట్టుతప్పి నేలమీద పడి పోయింది. ఆమె మీద అడుగులు వేస్తూనె జనం ముందుకు నడిచారు.

"అయ్యో! ముసలమ్మా! ముసలమ్మా!" ఆ దృశ్యం చూసిన పేరంటాలు కంగారుగా అరిచింది.

"తప్పుకోండి! తప్పుకోండి" పేరంటాలు పెనిమిటి జనాన్ని చేత్తో ఆపుతూ అరిచాడు.

జనం వల్చబడి అటు ఇటు పోగయ్యారు.

"ఏమైంది" కలక్టరుగారు సీటులోంచె అడిగారు.

ఎవరో ముసలమ్మ కిందపడిపోయింది." ముసలమ్మ దగ్గరకు వచ్చి చూసి వెళ్ళిన ఆఫీసరు సమాధానమిచ్చాడు.

వెంటనే డాక్టర్ని పిలిపించండి."

కలెక్టరుగారు వెంటవున్న జీపులో డాక్టర్ని తీసుకవచ్చారు.

"ఎప్పుడో చనిపోయింది." డాక్టరు పెదివి విరిచాడు.

"ఎవరి తాలూకో అడగండి" కలక్టరుగారి మాటనోట్లోడుండగానె ముసలమ్మ చేతిలో కాగితం కలక్టరు ముందు పెట్టాడు తహసీల్దారు.

"అది చదివిన కలక్టరు ముఖం వాడిపోయింది." అమ్మా! అంటు ముసలమ్మ శవం దగ్గరకు పరుగెత్తాడు. కరుడుకట్టిన హృదయం దుఃఖపు వరదై ప్రవహించింది.

అక్కడ వున్నవారి ఆశ్చర్యానికి అంతులేదు. అందరు ఆయ

నను చుట్టు ముట్టారు.

"ఆ ముసలమ్మ కలక్టరుగారి తల్లిట" ఆ విషయం దావానలంలా వ్యాపించింది. కలక్టరుగారి ప్రమేయం లేకుండానె పెద్ద ఎత్తున అంత్య క్రియలకు ఏర్పాట్లు చేయించారు. ఆ వూళ్ళో కొత్తగా ప్రారంభించ బోయె స్కూలుకు ఆమె పేరు పెడతామన్నారు. కలెక్టరు రాజా సమా ధానం చెప్పలేకపోయాడు. అతని మనస్సు పశ్చాత్తాపంతో కుములి పోయింది. తల్లి లేకుండా పెళ్ళి చేసుకోనన్నాడు. ఆ మావగారి ధనం కళ్ళు కప్పేసింది. చిక్కి, జీర్ణ వస్త్రలో ఉన్న తల్లిని మామగారికి చూపించలేకపోయాడు.

"ఏమండీ! ఆవిడ సంగతి యిప్పుడెందుకండీ" అందంగా ముస్తాబై వంటినిండా నగలతో, తలనిండ పూవులతో సెంటు వాసనలతో భార్య దరి చేరితే ఆ కౌగిలిలో కరిగిపోయిన తను తల్లిని గురించి భార్యకు చెప్పలేకపోయాడు. కొన్నాళ్ళకు ఆవూరు వెళ్ళాడు. ఎవరిని అడిగినా హనుమాయమ్మ సంగతి చెప్పలేకపోయారు.

"అమ్మా!" అంటూ వెక్కి వెక్కి యేడ్చాడు కలక్టరు రాజా!

ఆరోజు స్కూలు ప్రారంభోత్సవం. స్కూలు భవనానికి ముందు హనుమాయమ్మ రాతి విగ్రహం నెలకొల్పారు. పేరంటాలు, భర్త, చుట్టు పక్కల వాళ్ళు వచ్చి ఆ ముసలమ్మ విగ్రహనికి దండలువేసి పండుగ జరుపుకున్నారు. అన్నదానలు జరిగాయి. "ముసలమ్మ అదృష్టవంతు రాలు" అన్నారు వచ్చినవారంతా! కాని రాతి బొమ్మలో అమ్మను చూడలేని రాజా వెక్కి వెక్కి యేడ్చాడు. ఇక్కడ అన్నదానాలు. అన్నమేలేక మరణించింది ఆతల్లి. తనలాంటి తనయులు మాత్రం ఈ లోకంలో జన్మించకూడదనుకున్నాడు.

జన్మజన్మలకు తనకు ఆతల్లే కావాలని రాతిబొమ్మకు నమస్క రించాడు రాజా.